సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 19 । మార్చి । 2023



లైన్ క్లియర్..!

ఆమదాలవలస రోడ్డు విస్తరణకు లైన్ క్లియరైంది. విద్యుత్ స్తంభాల మార్పు పనులు మొదలయ్యాయి. - 8లో



150 ఫోన్ల రికవరీ

ఇరవై లక్షల విలువైన 150 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. తమ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కోరుతున్నారు. - 8లో

సజావుగా లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లావ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాలు జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. వివాహ సంబంధ కేసులు, వినియోగదారుల కేసులు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌కు సంబంధించిన కేసుల రాజీకి స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. 14 వివాహ సంబంధ కేసులను రాజీ చేశారు.

న్యూస్‌రీల్

సాంకేతిక విద్యపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు అన్నారు. కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న మార్పులు గమనిస్తూ ఉండాలని, డ్రోన్ల ప్రాధాన్యత ఇప్పుడు పెరుగుతోందని తెలిపారు. అన్ని రంగాల్లోనూ వీటి వినియోగం పెరిగిందని, వ్యవసాయంలో కూడా ఇవి కీలకం కానున్నాయని అన్నారు. విద్యార్థులు డ్రోన్ల పైలెటింగ్, నిర్వహణ, మరమ్మతులు, డిజైన్ వంటి వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ జి.సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ పగడాలమ్మ

నరసన్నపేట: టెన్త్ పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం ఉదయం తనిఖీ చేశారు. 9 గంటలకే స్కూల్‌కు చేరుకున్న ఆమె ఉపాధ్యాయుల హాజరు గమనించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆరోగ్యం చూసుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు. స్కూల్లో ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారో పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు.

21న నారాయణవలస సంత వేలం

కోటబొమ్మాళి: ఈ నెల 21న మంగళవారం ఉదయం 11 గంటలకు నారాయణవలస పశువుల సంతకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసేందుకు పూర్తి వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. శనివారంతో లాంగ్వేజ్ పేపర్ల పరీక్షలు ముగిసినట్టయింది. సోమవారం నుంచి గ్రూపు సబ్జెక్టులకు పరీక్షలు మొదలుకానున్నాయి. 20వ తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులు మ్యాథ్స్–1(ఎ), సివిక్స్, బోటనీ పేపర్–1కు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా నాల్గో రోజు శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సెట్–2 ప్రశ్న పత్రంతో ఇంగ్లిష్ పేపర్–2 పేపర్‌కు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా శనివారం మొత్తం 26,139 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (97.09 శాతం హాజరు) 25,379 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 760 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 23,626 మందికి 663, ఒకేషనల్ విభాగంలో 1850 మందికి 97 మంది విద్యార్థులు పరీక్షకు డుమ్మా కొట్టారు. శనివారం ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు స్పష్టం చేశారు. అధికారుల జిల్లా వ్యాప్తంగా జోరుగా తనిఖీలు నిర్వహించారు.

ఊరు.. కన్నతల్లి తీరు!



- ఆత్మీయతకు పెట్టింది పేరు ఉద్దానం
- కళాకారుల నుంచి ఉద్యోగుల వరకు అందరికీ సమున్నత గౌరవం
- ఉద్దానంలో అతిథి మర్యాదలు మరువలేమంటున్న అధికారులు

గోదావరి నాసిక్‌లో పుడితే.. మర్యాదలు గోదారిలో పుట్టాయని అంటుంటారు. ఆ మాటకొస్తే గోదారే కాదు మన ఉద్దానం దారుల్లో తిరిగినా అవే మర్యాదమన్నలు దొరుకుతాయి. ఇది జనం మాట మాత్రమే కాదు.. ఇక్కడ పనిచేసిన అధికారగణం మాట కూడా. ఓ కళాకారుడు ఊరికి వస్తే.. అతని మనసు నిండిపోయేలా సత్కరించడం.. ఓ అధికారి విధి నిర్వహణపై వస్తే పని పూర్తయ్యే వరకు గౌరవంగా పలకరించి ఆదరించడం.. ఓ ఉద్యోగి ఊరిలో నివాసం ఉంటే అప్పుడిలా చూసుకోవడం.. ఉద్దానం ఊళ్లకు పుట్టుకతో వచ్చిన లక్షణం. మనుషులను గౌరవించడం, అతిథులను బాగా చూసుకోవడం సగటు సిక్కోలువాసికి అలవాటు. ఉద్దానంలో ఆ అలవాటు మరికాసింత ఎక్కువ.

కవిటి :

పండగ పూట ఓ కళాకారిణి వచ్చి ఉద్దానంలో పాట పాడిందంటే ఆమె ఆ ఊరి ఆడపడుచు అయిపోవాల్సిందే. కొత్తగా ఒక టీచర్ ఊరిలో కాపురం పెడితే.. మనిషి తెలిసినా తెలియకపోయినా అన్ని శుభలేఖలూ ఆ ఇంటికి వెళ్లాల్సిందే. ఇక్కడి పనస పొట్టు కూర తినకుండా.. పనస తొనల రుచి చూడకుండా.. ఉద్దానం కొబ్బరి నీటితో కడుపు నింపుకోకుండా ఏ అతిథీ బయటకు వెళ్లడు. ఉద్దానం అతిథి గౌరవాలు లోకప్రసిద్ధి. సాధారణంగా జిల్లా చివర ఉద్యోగం చేయాలంటే.. చాలా మంది సంశయిస్తూ ఉంటారు. కానీ ఉద్దానంలో నివాసం ఉండి.. ఇక్కడి ఊరి తీరుతెన్నులు అర్థం చేసుకున్న వారి బతుకంతా ఇక్కడి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉంటారు.

చిక్కటి మజ్జిగ, చలచల్లని కొబ్బరి నీరుతో పలకరించడం కడుపుతోపాటు మనసు నిండిపోయేలా భోజనం పెట్టడం మన పల్లెల ప్రత్యేకత. తమ తోటల్లో పండే పనస, మామిడి, జీడిపిక్కలు, అరటి గెలలు, కొబ్బరికురిడీలు, మునగ వంటివి అతిథులకు ఇచ్చి సాగనంపడం వచ్చిన వారి మనసు దోచుకుంటాయి. ఈ ప్రాంతంలో పనిచేసేవారు ఉద్యోగులుగానే ఉండిపోరు.. చాలా కుటుంబాలకు సొంత మనుషులుగా మారిపోతారు. ప్రతి శుభ కార్యానికి ప్రత్యేక ఆహ్వానం ఉంటుంది. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన తర్వాత కూడా వారితో సంబంధ బాంధవ్యాలు సజీవంగా ఉంటాయి.

సండే స్పెషల్



జగతిలో పూడి సత్యనారాయణ కుటుంబంలో అతిథులతో సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

మళ్లీ వెళ్లాలనిపిస్తోంది..



ఉద్దానంలో నేరాల రేటు చాలా తక్కువ. నేను కవిటిలో పనిచేస్తున్నప్పుడు టైఫాయిడ్ వచ్చింది. అప్పుడు ఇక్కడి వారు నాపై చూపిన ఆదరణ అభిమానం మరువలేనిది. సొంత కుటుంబ సభ్యులు చూసుకున్నట్లు నన్ను చూసుకున్నారు. నా సర్వీసులో ఇలాంటి ప్రజలను ఎక్కడా చూడలేదు. వీరి అభిమానం వెలకట్టలేనిది. మళ్లీ వెళ్లాలనిపిస్తూ ఉంటుంది.

– కె.వాసునారాయణ, ఏసీబీ ఎస్‌ఐ, విజయనగరం.

నా సొంతూరులో లేని పరపతి..



నేను స్కూల్‌అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంగా కవిటి మండలం ముత్యాలపేటలో జాయిన్ అయ్యాను. తొలుత రెండు నెలలు నేను కుటుంబాన్ని అక్కడకు తీసుకురాలేకపోవడంతో ఒంటరిగా ఉండేవాడిని. ఆ రోజుల్లో మూడుపూటలా మా ఇంట్లో భోజనం చేయండి లేకుంటే క్యారియర్ పంపిస్తాం అని చాలా మంది అన్నారు. ఇక్కడ నాకు దక్కిన ఆదరణ, అభిమానం ఇంకెక్కడా దొరకలేదు.

– డి.కృష్ణారావు, హెడ్మాస్టర్, మందరాడ.

కష్టాల్లోనూ..



సహజంగా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎవరి ప్రాణాలు వారు కాపాడుకుంటారు. కానీ ఇటీవల తుఫాన్ సందర్భంలో నేను ప్రత్యేకాధికారిగా వెళ్తే ఇళ్లకు పిలిచి భోజనాలు పెట్టారు. ఇది నన్ను కట్టి పడేసింది. ఓ అధికారిని ఇంతలా అక్కున చేర్చుకోవడం ఇక్కడ రైతులకు తెలిసినంతగా మరో చోట కనిపించదు. కోనసీమలా రూపు మాత్రమే కాదు తీరు కూడా ఉంటుంది.

– హెచ్‌వీ జయరాం, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విశాఖపట్నం.


ఆడపడుచులా ఆదరణ..



పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డను ఏ రీతిన పలకరిస్తారో ఉద్దానంలో నన్ను అలాగే చూసుకున్నారు. 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నేను హరికథలు చెప్పడానికి వస్తున్నాను. ఇక్కడ ఇచ్చే గౌరవం ఇంకెక్కడా దొరకదు. పసుపు కుంకుమలు, చీరగాజులు పెట్టి ఏటా నన్ను సత్కరిస్తుంటారు.

– సప్పు భారతి, హరికథా భాగవతారిణి, ఏలూరు.

ఎన్ని మర్యాదలో..



నేను 35 ఏళ్ల కిందట కవిటిలో ఓ కచేరీ కోసం వచ్చాను. మమ్మల్ని భారీగా స్వాగతించడం, గౌరవంగా వీడ్కోలు పలకడం ఇంకా గుర్తుంది. ఇక్కడ ఉన్న రెండు రోజులు పనస తొనలు, మామిడి పళ్లు, లేత కొబ్బరినీళ్లు, పట్టు తేనె, జీడిపప్పు వంటి వాటితో రుచికరమైన జ్ఞాపకాలు పంచారు.

– మోదుమూడి సుధాకర్, మ్యూజిక్ ప్రొడ్యూసర్, ఆల్ ఇండియారేడియో, విజయవాడ.

చేతులు జోడిస్తారు..




సీహెచ్.కోటేశ్వరరావును తల్లిదండ్రులతో కలిపి సత్కరిస్తున్న డొంకపుట్టుగ గ్రామస్తులు

నేను 2010లో డొంకపుట్టుగలో టీచర్‌గా జాయిన్ అయ్యాను. ఇక్కడ టీచర్ కనిపిస్తే రెండు చేతులు జోడించి నమస్కారం పెడతారు. చాలామంది ఈ పద్ధతి మర్చిపోయారు. ఉద్దానం మాత్రమే ఇంకా గుర్తు పెట్టుకుంది. ఇక్కడ ఆరేళ్లు పనిచేసి వెళ్లిపోయాక కూడా.. నన్ను మా అమ్మను పిలిచి బంగారు ఆభరణాలు ఇచ్చి సత్కరించారు. అమ్మకు పసుపు కుంకుమ చీర పెట్టారు. ఇప్పటికీ పెళ్లి పిలుపులు అందుతుంటాయి.

–సీహెచ్.కోటేశ్వరరావు

ఇక్కడోసారి తిరగాలి..



పాతికేళ్లుగా ఉద్దానంలో తిరుగాడుతున్నాను. మర్యాదమన్నలకు ఉద్దానం ఊళ్లు పెట్టింది పేరు. ఎవరికైనా సందేహం ఉంటే ఇక్కడ ఓ సారి తిరగాలి.

– కేకేఎల్ స్వామి, జాతీయ స్థాయి నాటక దర్శకుడు, రచయిత, గరివిడి, విజయనగరం జిల్లా



కవిటి బస్టాండ్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ నర్తు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన నర్తు రామారావు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం అసెంబ్లీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మంత్రులు ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు ఉన్నారు.

వేసవి జాగ్రత్తలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వేసవి వడగాడ్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టర్‌తో పాటు జేసీ ఎం.నవీన్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్‌ను ఆదేశించారు. వడగాలులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రతి పెట్రోల్ బంక్ వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి పనుల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలన్నారు. పని వేళలు కూడా మార్చాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడుల్లో ప్రతి రెండు గంటలకు బెల్ కొట్టి నీరు తాగేలా చేయాలన్నారు. అడవుల్లోనూ నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిశాకుమారి, నగర పాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీపీఆర్ఓ కె.బాలమాన్‌సింగ్, వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ, ఫైర్, పోలీసు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి’



డ్రైవింగ్ సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 11వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్ కుమార్ చేతుల మీదుగా శనివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఒకటో డిపో గ్యారేజీలో సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు రాబోయే కాలంలో ఆర్టీసీతో పాటు ఇతర గవర్నమెంట్ విభాగాల్లో కూడా చాలా మంచి అవకాశాలు ఉంటాయన్నారు. హెవీ లైసెన్స్ వచ్చిన 18 నెలల తర్వాత ఆ రోజు పరిస్థితులు బట్టి ఆర్టీసీలోని అవకాశాలుంటాయన్నారు. 12వ బ్యాచ్ ఈ నెల చివరి వారంలో మొదలవుతుందని ఆసక్తి గల అభ్యర్థులు 9963091999, 7382921920 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్, ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వర్మ తదితరులు ఉన్నారు.

జగనన్న విద్యాదీవెన నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేద విద్యార్థుల చదువుకు భరోసా ఇస్తున్న జగనన్న విద్యా దీవెనకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత నిధులు ఆదివారం విడుదల చేయనున్నారు. ఈ నగదు విద్యార్థుల తల్లుల ఖాతాలో నేరుగా జమ కానున్నాయి. మూడేళ్లుగా జగనన్న విద్యాదీవెన, విద్యా కానుకలను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడతగా ఈ నగదు విడుదల చేయనున్నారు. జిల్లా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో 53,867 మంది విద్యార్థులు ఉండగా వారి తల్లులు 48,345 మంది ఖాతాల్లో రూ.31,40,71,490 జమ కానున్నాయి.

కూలైన సిక్కోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు : రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చెదురుమదురు జల్లులు కురుస్తున్నాయి. దీంతో జిల్లా వాతావరణం చల్లబడింది. పాతపట్నం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం గంట పాటు కురిసింది. అచ్చుతాపురం, ప్రహరాజపాలేం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, రొంపివలస, గంగువాడ తదితర గ్రామాల్లో జీడి, మామిడి పిందెలు రాలిపోయాయి. మెళియాపుట్టి మండలంలోని చాపర, పెద్ద పద్మాపురం, మర్రిపాడు.సి, పట్టుపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొత్తూరు మండలంలో శనివారం సాయంత్రం నుంచి కుండపోత వాన కురిసింది. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి మొత్తం వర్షం నీరుతో నిండిపోవడంతో వాహన దారులు ఇబ్బంది పడ్డారు.



కొత్తూరులో రోడ్డు మీద ప్రవహిస్తున్న వర్షం నీరు



పాతపట్నంలో వాన కురుస్తున్న దృశ్యం



అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...

శ్రీకాకుళం జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 089422-27678 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష.. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ఠ అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

- ★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
- ★ ఇసుక బ్లాక్ మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ ఆన్ లైన్‌లో, ఆఫ్ లైన్ తో పాటు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ మరియు డోర్ డెలివరీ సదుపాయం..
- ★ www.andhrasand.com ద్వారా ఇసుక ఆన్‌లైన్ లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన JPVL సంస్థ..
- ★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
ఇచ్ఛాపురం	రూ. 930/-	శ్రీకాకుళం	రూ. 780/-
పలాస	రూ. 920/-	ఆమదాల వలస	రూ. 600/-
టెక్కలి	రూ. 810/-	ఎచ్చెర్ల	రూ. 680/-
పాతపట్నం	రూ. 745/-	నరసన్నపేట	రూ. 525/-

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500

వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 97000 09944

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

క్లుప్తంగా

'ప్రతి ధాన్యం గింజా కొంటాం'

గార: ఖరీఫ్‌లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆదేశాలు వచ్చాయని, రైతులు నూర్పులు చేసి ధాన్యం సిద్ధం చేయాలని గార ఎంపీపీ, ఉత్తరాంధ్ర వ్యవసాయ విభాగం అధ్యక్షుడు గొండు రఘురామ్ అన్నారు. శనివారం శ్రీకూర్మం జంక్షన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి శ్రీకాకుళం మండలంలో 2500 మెట్రిక్ టన్నులు, గార మండలంలో2500 మెట్రిక్ టన్నో ధాన్యం సేకరణకు ఆదేశాలు వచ్చాయని వివరించారు. రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండిపోవడంపై మంత్రి ధర్మాన ప్రసాదరావు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కొనుగోలుకు ఆదేశాలిచ్చినట్టు వెల్లడించారు. రైతులు వెంటనే నూర్పులు చేసి వారం రోజుల్లోగా అందివ్వాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో ఫైర్‌సర్వీస్ డీజీ


మాదిరెడ్డి ప్రతాప్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈయన వెంట వన్ టౌన్ ఎస్సై బలివాడ గణేష్, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నరసన్నపేటలో సాయికుమార్ సందడి


సాయికుమార్‌తో ఏజీపీ సత్యనారాయణ, స్థానికులు

నరసన్నపేట: సినీ నటుడు సాయికుమార్ నరసన్నపేటలో శనివారం కొద్ది సమయం గడిపారు. బరంపురం వెళ్తూ నరసన్నపేటలో ఆగి స్థానిక గురుధరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు విచ్చేశారు. నరసన్నపేట కోర్టు ఏజీపీ గొండు సత్యనారాయణ, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ స్వాతిలు సాయికుమార్‌కు జ్ఞాపికను అందించారు. అనంతరం స్థానికులు సాయికుమార్‌తో ఫోటోలు తీసుకున్నారు.

'ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటాం'

ఇచ్ఛాపురం రూరల్: బొడ్డఖాళి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న లండ లయను విచక్షణా రహితంగా బెత్తంతో కొట్టిన ఉపాధ్యాయురాలు జి.లలితపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. శనివారం పలు దినపత్రికల్లో వచ్చిన కథనాల మేరకు ఎంఈఓ కురమాన అప్పారావు అధ్యక్షతన చైల్డ్‌లైన్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలతో నిర్వహించిన విచారణలో ఉపాధ్యాయురాలు తప్పును అంగీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు సీతారాం ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ బాలలను కొట్టే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో విద్యార్థులపై దాడులు, దండనలకు పాల్పడితే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ సమక్షంలో మరోమారు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. 1098 గెస్ట్ చైల్డ్‌లైన్ సభ్యురాలు ఆర్.రూన్సీ, మహిళా పోలీస్ భారతీ రాణో, గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బత్తుల సుశీల ఉపాధ్యాయురాలిని విచారించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	56,150-00
బంగారం(22క్యా. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఆమదాలవలస రోడ్డు విస్తరణకు..

లైన్ క్లియర్

- విద్యుత్ స్తంభాల మార్పు పనులకు టెండర్ ఖరారు
- రూ.7.34 కోట్లతో పనులు ప్రారంభించనున్న విద్యుత్ శాఖ


ఆమదాలవలస రహదారికి ఇరువైపులా తొలగించనున్న విద్యుత్ స్తంభాలు ఇవే..

అరసవల్లి:

శ్రీకాకుళం- ఆమదాలవలస రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులు ఊపందుకోనున్నాయి. కళింగపట్నం-పార్వతీపురం (సీఎస్‌పీ రోడ్డు) రాష్ట్ర రహదారిలో భాగమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆమదాలవలస బ్రిడ్జి ముందు వరకు సుమారు 10.4 కిలోమీటర్ల మేర రహదారిని రూ.40 కోట్లతో విస్తరించేందుకు గతేడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ విద్యుత్ స్తంభాలు ఇరువైపులా ఉండిపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చెట్ల తొలగింపు పనులు పూర్తి చేసినా విద్యుత్ శాఖ పనులకు టెండర్ ప్రక్రియ ఖరారు కాకపోవడంతో విస్తరణకు బ్రేక్ పడింది. తాజాగా విద్యుత్ శాఖ పరంగా టెండర్ పనులు ఖరారు కావడంతో ఎట్టకేలకు క్లియరెన్స్ దొరికింది. విద్యుత్ స్తంభాల తొలిగింపు, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల టెండర్ ప్రక్రియ తాజాగా ఖరారైంది. ఈ మేరకు ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయ్యింది.

రూ.7.34 కోట్లతో విద్యుత్ పనులు..

జిల్లా కేంద్రం నుంచి ఆమదాలవలస బ్రిడ్జి వరకు ఇరువైపులా విద్యుత్ స్తంభాల తొలిగింపు, కొత్తగా ఏర్పాటు పనులకు విద్యుత్ శాఖ రూ.7.34 కోట్లతో పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. మొత్తం 10.4 కిలోమీటర్ల రహదారిలో 400పైగా విద్యుత్ స్తంభాలు, 60 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాల్సి ఉంది. మూడు భాగాలుగా పనిని విభజించి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుల జోక్యంతో ఈ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పాలి. త్వరితగతిన విస్తరణ పనులు పూర్తయితే..శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల అభివృద్ధికి దోహదపడుతుంది.

రెండు మూడు రోజుల్లో పనులు..



విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్తగా ఏర్పాటు పనులకు ఎస్ఈ దైవప్రసాద్ సమక్షంలో కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్లు ఇచ్చేశాం. రెండు మూడు రోజుల తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి. – ఎస్.బయ్యన్నాయుడు, శ్రీకాకుళం డివిజన్ ఈఈ

రూ.20 లక్షల విలువైన 150 ఫోన్లు రికవరీ


పోలీసులు రికవరీ చేసిన మొబైల్స్

- బాధితులకు అందజేసిన ఎస్పీ రాధిక
- ఫోన్ పోగొట్టుకుంటే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వెల్లడి


బాధితులకు మొబైల్స్ అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : స్మార్ట్ ఫోన్ పోగొట్టుకుంటే ఆన్‌లైన్‌లో లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. రూ. 20 లక్షల విలువైన 150 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ శాఖ ఐటీ కోర్ టీమ్ రూపకల్పన చేసిన లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వా రికవరీ చేసి బాధితులకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా ఫోన్లు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులు 'హెచ్‌టీటీపీ శ్రీకాకుళంపోలీస్.ఇన్ మొబైల్ ట్రాక్ అప్‌లోడ్ అధికార వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో జిల్లా సైబర్ సిబ్బంది 150 ఫోన్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాధిక మాట్లాడుతూ మొబైల్ ఫోన్లో సెక్యూరిటీ లాక్ లేకుండా ఎటువంటి సమాచారాన్ని ఉంచరాదని, క్రెడిట్ కార్డు, ఏటీఎం పిన్ నంబర్లు, నెట్ బ్యాంకింగ్‌లకు భద్రతాపరమైన లాకింగ్ వేసుకోవాలన్నారు. చోరీ చేసిన ఫోన్లను తక్కువ ధరలకు ఇతరులకు అమ్మివేస్తారని, ఇలాంటి వాటిని మన జిల్లా, రాష్ట్రం, దేశం నుంచే కాక ఇతర దేశాల నుంచి రికవరీ చేశామన్నారు. మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుంటే తక్కువ కాలంలోనే ఫోన్లు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో రూ. 12.50 లక్షల విలువైన 130 మొబైల్ ఫోన్లను అందజేశామని, ఇప్పటివరకు రూ. 32.50 లక్షల విలువైన 280 ఫోన్లను బాధితులకు అందజేశామని వివరించారు. మిగతా ఫోన్లు కూడా వీలైనంత త్వరగా రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని చెప్పారు. సరైన పత్రాలు లేకుండా మొబైల్ ఫోన్లను బయట కొనవద్దని ఎస్పీ సూచించారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబర్చిన సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వరరావు, ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ బి.రమేష్ సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు


పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్‌బస్సు

- చిన్నారులకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్‌నిర్లక్ష్యం కారణంగా గుర్తించి కేసు నమోదు

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం వద్ద శనివారం ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పిన ఘటనలో చిన్నారులకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేటలోని సెయింట్ క్లారెట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన బస్సు 40 మంది విద్యార్థులతో పిన్నింటిపేట, నిమ్మాడ మీదుగా పాఠశాలకు వస్తుండగా ఆటోను ఓవర్ ట్రాక్ చేస్తూ ఒక్కసారిగా రోడ్డుపక్కనే ఉన్న వేరుశనగ పొలంలోకి దూసుకుపోయింది. దీంతో పిల్లలంతా భయాందోళనకు గురయ్యారు. రోడ్డుకు సమానంగా పొలం ఉండటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బస్సులో ఉన్న చిన్నారులను వేరే బస్సులో నరసన్నపేట తరలించారు. చిన్నారుల క్యారియర్‌లు, బ్యాగులు ప్రమాదం జరిగిన బస్సులోనే చెల్లాచెదురుగా ఉండటాన్ని గమనించిన కొందరు తల్లిదండ్రులు సిబ్బందిని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పలేకపోవటంతో బస్సు అద్దాలు ధ్వంసంచేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని సమీక్షించారు. డ్రైవర్ కోటేశ్వరరావు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినందుకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

ఆరాతీసిన ఎమ్మెల్యే కృష్ణదాస్..

స్కూల్ బస్సు ప్రమాదానికి గురైందని సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఘటనపై ఆరాతీశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయన స్థానిక నాయకులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల గురించి తెలుసుకోవాలని ఆదేశించారు. పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు పాఠశాలకు వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.


ఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

టెక్కలి: మేజర్ పంచాయతీ పరిధిలోని అంజనాపురంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ముడిదాన జంగమయ్య ఇంట్లో సామగ్రి దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వస్తువులన్నీ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆట్ల రాహుల్, వార్డు సభ్యుడు టి.లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని వీఆర్‌ఓ నాగరాజుకు సమాచారం అందజేశారు. బాధితులకు తమవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కిడ్నీవ్యాధులపై అవగాహన అవసరం


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునాయిద్ అహ్మద్ మౌలానా. చిత్రంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

కవిటి: అంతుచిక్కని కారణాలతో ఆందోళన రేకెత్తిస్తున్న ఉద్దానం కిడ్నీవ్యాధులపై ప్రతి ఒక్కరూ ప్రాథమిక అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి జునాయిద్ అహ్మద్ మౌలానా, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. కవిటి మండలం రాజపురం, బెలగాం పీహెచ్‌సీల పరిధిలో శనివారం ఉచిత కిడ్నీవ్యాధి పరీక్షల అవగాహన వైద్యశిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గతంలో ఉన్న 88 డయాలసిస్ పరికరాలకు అదనంగా ఆరు పీహెచ్‌సీలో ఒక్కోచోట ఆరు చొప్పున 36 డయాలసిస్ యంత్రాలను అదనంగా మంజూరు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని అన్ని పీహెచ్‌సీల్లో ప్రాథమిక కిడ్నీపరీక్షలు, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ 676 మందికి ఉచితంగా రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ సెక్రటరీ సన్యాసినాయుడు, సీనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్, తహశీల్దార్ రాచర్ల అప్పలరాజు, ఎంపీడీఓ సూర్యనారాయణ, ఇచ్ఛాపురం సీఐ ఈశ్వర్‌చంద్రప్రసాద్, ఎస్ఐ కె.రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు క్లినిక్‌లో పనేంటి?


రోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

- దీర్ఘకాలిక సెలవులో ఉన్న వైద్యసిబ్బంది స్థానంలో కొత్తవారిని నియమిస్తాం
- టెక్కలి జిల్లా ఆస్పత్రి తనిఖీలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ ఆసుత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది విధులకు సెలవులు పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లో ఎలా ఉంటున్నారని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందిని నిలదీశారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇటీవల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఎంత వరకు పరిష్కారమయ్యాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వైద్య నిపుణురాలు ధనలక్ష్మి విధులకు హాజరుకాకపోవడాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది విధులకు సెలవులు పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇకపై వైద్య సిబ్బందికి సెలవు కావాలంటే జిల్లా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. సుదీర్ఘంగా సెలవుల్లో ఉన్నవారి స్థానంలో కొత్త వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.సూర్యారావు, ఆర్ఎంఓ శ్రీరాములు, వైద్య సిబ్బంది కె.కేశవరావు, తేజ్‌ప్రవీణ్, వినోద్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- నిమిషాల వ్యవధిలో అక్కాచెల్లెల్లు మృతి
- వసపలో విషాద ఛాయలు


గురుగుబిల్లి అనసూయ్మ(ఫైల్)


మామిడి సన్యాసమ్మ (ఫైల్)

కొత్తూరు: నిమిషాల వ్యవధిలో అక్కాచెల్లెల్లు మృతి చెందిన విషాద ఘటన కొత్తూరు మండలం వసప గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వసప గ్రామానికి చెందిన మామిడి సన్యాసమ్మ(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చెల్లెలకు సేవలు చేసేందుకు ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన అక్క గురుగుబిల్లి అనసూయమ్మ(65) నెల రోజుల క్రితం వసప చేరుకుంది. శనివారం ఆరోగ్యం విషమించడంతో సన్యాసమ్మ మృతి చెందింది. చెల్లి మృతచెందడంతో అనసూయమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. కొద్దిసేపటి తర్వాత బీపీ పెరగడం, తీవ్ర ఒత్తిడికి గురికావడంతో అనసూయమ్మ కూడా మృతిచెందింది. అక్కా చెల్లెల్లు వెనువెంటనే మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదన మిన్నంటాయి. సన్యాసమ్మకు భర్త నరసింహం, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అనసూయమ్మ భర్త శ్రీరాములు మృతి చెందగా ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


అపస్మారక స్థితిలో మోహనరావు

కంచిలి: మండలంలోని జాడుపూడి కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. జాడుపూడికి చెందిన డొప్ప నరేష్ తన గ్రామం నుంచి స్టేషన్ వైపు ద్విచక్రవాహనంతో వెళుతూ.. జాడుపూడి స్టేషన్ నుంచి స్వగ్రామం గొల్లపుట్టుగకు స్కూటీ నడుపుకొంటూ వస్తున్న మురపాల మోహనరావును బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇద్దర్నీ సోంపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందించారు. మోహనరావు పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం తరలించారు. మోహనరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి


ఘటనా స్థలంలో తమ్మయ్య

పోలాకి: మండలంలోని కింజరాపుపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దీర్ఘాశి గ్రామానికి చెందిన శిర్ల తమ్మయ్య(70) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తరేవుకు చెందిన మైలపల్లి కృష్ణ పోలాకి-నరసన్నపేట రోడ్డుపై బైక్‌పై వెళ్తుండగా కింజరాపుపేట వద్ద అకస్మాత్తుగా సైకిల్‌పై తమ్మయ్య ప్రధాన రహదారిపైకి రావటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలైన తమ్మయ్యను ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వలస కూలీ మృత్యువాత


మద్దు భాస్కరరావు(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామానికి చెందిన వలస కూలీ మద్దు భాస్కరరావు(46) విశాఖపట్నంలో ప్రమాదవశాత్తు శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కరరావు తన భార్య కల్పన, ఇద్దరు పిల్లలతో కలిసి కూలీ పనుల కోసం కొన్నాళ్ల కిందట విశాఖపట్నం వెళ్లాడు. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఓ భవనానికి రంగులు వేస్తుండగా ప్రమాదం జరగడంతో మృత్యువాత పడ్డాడు. విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



బియ్యం గింజపై ఆస్కార్

శ్రీకాకుళం పట్టణానికి చెందిన చిత్రకారుడు వాడాడ రాహుల్ బియ్యపు గింజలపై ఆర్‌ఆర్‌ఆర్, ఆస్కార్ చిత్రాలను గీసి అబ్బురపరిచారు. ఇటీవల ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటునాటు పాటకు గాను ఆస్కార్ అవార్డు లభించిన విషయం తెలిసిందే. – శ్రీకాకుళం కల్చరల్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

FREE TRAINING

■ Praise The lord పేద అమ్మాయిలకు Hyd కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతి, HR మేనేజర్ + మీడియా ప్లానర్-డిజి॥ మా॥+ కంప్యూటర్ అకౌంట్స్ + ప్రొఫెషనల్ కోర్సులు 120డేస్ ట్రైనింగ్ తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం. డిగ్రీ + స్మార్ట్ ఫోన్ మస్ట్. Ph: 9182242932 [HA-2439]

PLOT FOR SALE

■ భోగాపురం Airport కి అతి చేరువలో NH-16 కి అతి దగ్గర్లో అతి తక్కువ ధరల్లో Plots (ఇల్లు స్థలాలు) కలవు. గజం ధర రూ.2,999/- మాత్రమే. ఫోన్ : 88855 99720 [V- 10326]

■ భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకి దగ్గరలో 20 ఎకరాల కొబ్బరి తోటలో Open ప్లాట్స్ కలవు. బీచ్‌కు సమీపంలో సంప్రదించండి : 88864 64566, 79818 07460 [V-11508]

HOUSE FOR SALE

■ Vizianagaram, Vuda Colony, House for Sale, 217Sqyds. Genuine Buyers. Rs 75L. Contact 9869051877/ 9392600339 [H-793461]

LAND FOR SALE

■ For Sale Single bit prime Land of 163 Acres. Clear title. Near Highway. road-front. Excellent environment for living, business and agriculture. Red soil with high iron content. Nawabpet (V),Chityala(M),Jayashankar Bhupal pally (D). Contact: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26338]

ASTROLOGY

■ శ్రీ బాలాజీ అనుగ్రహ జ్యోతిష్య పీఠం పండిట్: శ్రీ బాలాజీ అనుగ్రహ ఆరదనతో విద్య, ఉద్యోగం, భార్యా భర్తల గొడవలు, కోర్టు కేసులు, వ్యాపారం, సంతానం, సమస్యలు ఎలాంటి సమస్యలు ఉన్న ఫోన్ ద్వారా పరిష్కారం. Ph: 9902893454 [H-793586]

SERVICES

■ పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1783]

CATERING SERVICES

■ కనకమహాలక్ష్మి కేటరింగ్ : వైజాగ్ వివాహాది శుభకార్యములకు ఇతర ఫంక్షన్లకు క్యాలిటీఫుడ్ క్యాటరింగ్ కొరకు సంప్ర : K.S.ప్రసాద్, మద్దిలపాలెం. ఫోన్ : 93463 04680, 92471 29764 [V-6071]

సామిల్లు అమ్మకం

■ సామిల్లు అమ్మకం. సామిల్లు (లాగ్‌సా, బేన్‌సా) అమ్మబడును. సంప్రదించండి: 99123 44990 [P- 760]

WANTED

■ శ్రీకాకుళంలో గాయిత్రి మ్యారేజ్‌బ్యూరో మరియు జాబ్ కన్సల్టెన్సీ ఆఫీసుకు ఫీల్డ్ స్టాఫ్ భార్యభర్తలు M/F డోర్‌టూడోర్/కంపెనీలుకు వెళ్ళుటకు PT / FT కావలెను. ఉచిత వసతి + జీతం. సెల్: 8522843440 [S-756379]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795229]

■ విజయవాడలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి వృద్దులను, బెడ్‌పేషంట్ లను వారి ఇంటి వద్దె చూసుకొ నుటకు కేర్‌టేకర్స్ M/F కావలెను. జీతం 15-20K వసతి+భోజనం© 94942 25282, 72070 72559 [B-970]

■ సైట్ ఇంజినీర్స్: నిర్మాణ పనులు పర్యవేక్షణ కోసం 30 సం॥లోపు సివిల్ గ్రాడ్యుయేట్స్ కావలెను. పురుష అభ్యర్థులు మాత్రమే. సంప్ర॥ © 99891 13036, 98481 13036 [B-1165904]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233,8008091300 [M-1190655]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792834]

■ ప్రముఖ సంస్థయందు పర్మినెంటుగా పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఎటువంటి టార్గెట్లు లేవు. వివరాలకు ఫోన్: 9491376845. [HA-10454]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 16K-18K. విజయవాడ. Ph: 9640528899, 9640648899 [HA-1117]

■ హైదరాబాద్ వృద్ధాశ్రమంలో పని॥కు రెసి॥ లేడీకేర్ టేకర్స్, రెసి॥ వంటవారు (వ: 35సం॥ ఆపైన) & ఆయాలు కావలెను. మంచి జీతం ఫ్రీ వసతి, భోజన సదుపాయం. సంప్ర: Ph: 9700006699, 7981467036. [H-793538]

■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashier, Clerks, Senior Officers (Sales), Attenders కావలెను. జీతం: 12,000-40,000 వరకు, 96425 06425. [T-4099]

■ టైలరింగ్ వర్క్ క్లాత్ మెటీరియల్ ఇస్తాం. మీ ఇంటివద్దే కుట్టి మాకు ఇవ్వండి. నెల నెల ఆదాయం పొందండి. ఫోన్ : 73864 14014, 72878 04086 [V-778242]

■ శ్రీకాకుళం మ్యాక్స్ బట్టల షాపు నందు హౌస్ కీపింగ్ జాబ్ చేయడానికి బాయ్ అర్జెంటుగా కావలెను. జీతం : 10300/-. PF + ESI. ఫోన్ : 89858 82193, 93906 37752 [V-775225]

■ Wanted : Female DMO's (BHMS/ BAMS/Pharma-D), OT Tech, Pharmacist, Address : Gopalapatnam, Vizag. Ph : 89192 51313 [V-1782]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.